సాక్షి రంగారెడ్డి

బుధవారం ၊ 3 ၊ జూలై ၊ 2024



అభిప్రాయాలు నివేదిస్తాం

రైతు భరోసా పథకం అమలుకు రైతులు తమ అభిప్రాయాలను చెప్పాలని జిల్లా అధికారి ధాత్రిదేవి అన్నారు. 8లో▸



అయ్యోపాపం..

పొలం పనులు చేస్తుండగా విద్యాదాఘాతానికి గురై కాడెద్దు మృత్యువాత పడింది. 8లో▸



తప్పిదాలు సవరించాలి

టీచర్ల బదిలీలు, స్పౌజ్ పోస్టింగ్‌లో జరిగిన తప్పిదాలను సవరించాలని పీఆర్టీయూ అధ్యక్షుడు గోవర్ధన్ డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

మంత్రి వర్గంలో మల్‌రెడ్డికి చోటు?

అకస్మాత్తుగా ఎమ్మెల్యే పర్యటన రద్దు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కోసం మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించాల్సి ఉండగా అకస్మాత్తుగా ఆయన పర్యటన రద్దయింది. అభివృద్ధి కార్యక్రమాలకు హాజరు కావడానికి అరగంట ముందే ఢిల్లీ నుంచి ఎమ్మెల్యేకు పిలుపు రావడంతో ఆయన మండల పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలిపారు. కాగా ఈ నెల 4న రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ప్రచారం జరుగుతున్న వేళ మల్‌రెడ్డి రంగారెడ్డికి ఏఐసీసీ నుంచి పిలుపు రావడంతో మంత్రి వర్గంలో ఆయనకు చోటు దక్కే అవకాశాలున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు.

తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా అమరేందర్‌రెడ్డి



తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్‌గా కె.అమరేందర్ రెడ్డిని నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జి కమిషనర్‌గా మీర్‌పేట కమిషనర్ బి.చంద్రశేఖర్ కొనసాగుతున్న విషయం విదితమే.

బంద్‌ను విజయవంతం చేయండి

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

చేవెళ్ల: నీట్, నెట్ పేపర్ల లీకేజీని నిరసిస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 4న దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి రాజేశ్ అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. పరీక్ష పేపర్ లీకేజీకి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అశోక్, సిద్ధార్థ, బన్ని, హరీశ్, అజయ్, శివప్రసాద్, హేమంత్, సాయి, అఖిల్, నర్సింహ తదితరులున్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

షాద్‌నగర్ రూరల్: పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. బూర్గుల శివారులోని గ్లాస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడిన, మృతి చెందిన కుటుంబాలని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు పరిశ్రమల్లో తరచూ తనిఖీలు నిర్వహించి కార్మికుల సంక్షేమానికి పాటుపడాలన్నారు. పేలుడు ఘటన బాధిత కుటుంబాలకు రూ.40లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పానుగంటి పర్వతాలు, శ్రీను, బుద్దుల జంగయ్య, అఖిల్, జంగయ్య, పవన్, రాజు, రమేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో ముసలం

బడంగ్‌పేట కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మార్పునకు కమిషనర్‌తో భేటీ



బడంగ్‌పేట మున్సిపల్ కార్యాలయం

బడంగ్‌పేట్: రాష్ట్రంలో రెండో అతిపెద్ద కార్పొరేషన్ బడంగ్‌పేట్. ఫ్లోర్ లీడర్‌ను మార్చాలంటూ మంగళవారం నలుగురు కార్పొరేటర్లు కమిషనర్‌ను కలవడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు రెండు గ్రూపులుగా విడిపోయారు. ఎన్నికల సమయంలో హస్తం గుర్తుపై ఏడుగురు కార్పొరేటర్లు గెలుపొందగా పారిజాతారెడ్డి కాంగ్రెస్‌ను వీడి గులాబీ గూటికి చేరి మేయర్ పీఠం దక్కించుకున్నారు. తదనంతరం ఆమె సొంతగూటికి చేరారు. ఇక్కడ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా వంగేటి ప్రభాకర్‌రెడ్డి కొనసాగుతున్నారు. కాగా ఇటీవల అధికార పార్టీకి చెందిన మేయర్, కార్పొరేటర్ల మధ్య వైరం రాజుకుంది. ఫ్లోర్ లీడర్ మార్పునకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైతం సుముఖంగా ఉన్నట్లు సమాచారం.

రూ.20 కోట్ల భూమికి ఎసరు!

కబ్జా చేస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

- కార్పొరేషన్ పాలకుల హస్తం ఉందంటూ ఆరోపణలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాలాపూర్ దళితులు



తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాలాపూర్ గ్రామస్తులు

బడంగ్‌పేట్: ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను పడింది. సుమారు రూ.20 కోట్లకు పైగా విలువ చేసే భూమిని కాజేసే కుట్రకు అక్రమార్కులు తెరలేపారు. రెవెన్యూ అధికారులు, బడంగ్‌పేట పాలక వర్గంలోని కొందరు బడా నేతలు కుమ్మక్కై ఈ తతంగానికి యత్నించారు. అడ్డుకోవాల్సిన అధికారులు సైతం మిన్నకుండడం అనుమానాలకు తావిస్తోంది. బాలాపూర్ పరిధిలోని ఏఆర్‌సీఐ గోడలకు ఆనుకుని సర్వే నంబర్ 74లో సుమారు 2.5ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి కబ్జాకు ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించారు. కార్పొరేషన్ పాలకవర్గంలోని కొందరితో చేతులు కలిపి రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ప్రహరీ ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణానికి పూనుకున్నారు. 2010–12లో కబ్జాకు యత్నించగా.. సరూర్‌నగర్ రెవెన్యూ అధికారులు అడ్డుకుని ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

ఏఆర్‌సీఐ ఏర్పాటులో భాగంగా 96 కుటుంబాల నుంచి 96 ఎకరాల భూమిని ఇచ్చామని బాలాపూర్ దళితులు చెబుతున్నారు. ప్రహరీ నిర్మించే సమయంలో వదిలేసిన మూలలు 2.5 ఎకరాలుండగా అన్యాక్రాంతానికి పాల్పడుతున్నారని.. ఈ భూమిని కాపాడి ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించాలని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కబ్జాలకు సూత్రధారుడిగా వ్యవహరిస్తున్న సింగిరెడ్డి జైహింద్‌రెడ్డి అతని సోదరులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



ఆర్‌సీఐ రోడ్డులోని కబ్జాకు గురవుతున్న స్థలం ఇదే

రిపోర్టు ఆధారంగా చర్యలు

బాలాపూర్‌లోని ఆర్‌సీఐ రోడ్డులోని భూమి కబ్జా అయిందని మా దృష్టికి వచ్చింది. ఆ భూమి ప్రభుత్వానిదా? ప్రైవేటుదా తేల్చాల్సి ఉంది. సర్వేయర్‌ను పంపాం. వారి రిపోర్టు ప్రకారం రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుని చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిగా తేలితే నిర్మాణాలను కూల్చివేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

– మాధవిరెడ్డి, తహసీల్దార్, బాలాపూర్

చలో అమెరికా!



తెలుగు విద్యార్థుల డెస్టినేషన్‌గా యూఎస్

- 2016తో పోల్చితే నాలుగు రెట్లు పెరిగిన విద్యార్థులు
- తెలుగు మాట్లాడే వారు అత్యధికంగా కాలిఫోర్నియాలోనే..
- యూఎస్‌లో మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుకు 11వ స్థానం
- ఐటీ, ఫైనాన్స్ సెక్టార్లపై ఆసక్తి

సాక్షి సిటీ బ్యూరో: ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులు తమ డెస్టినేషన్‌గా అమెరికాను ఎంపిక చేసుకుంటున్నారు. ఏటా 60 వేల నుంచి 70 వేల మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు యూఎస్ చదువుల కోసం బ్యాగ్‌లు సర్దిపెట్టుకుంటున్నారు. యునైటెడ్ స్టేట్స్ సెన్సస్ బ్యూరో లెక్కల ఆధారంగా 2016తో పోల్చితే 2024 నాటికి అమెరికాలో తెలుగు వారి సంఖ్య నాలుగింతలు పెరిగిందని స్పష్టమవుతోంది. ప్రధానంగా కాలిఫోర్నియా, టెక్సాస్, న్యూ జెర్సీ, డల్లాస్, నార్త్ కరోలినా, ఇల్లినాయిస్, వర్జీనియా, అట్లాంటా, ఫ్లోరిడా, జార్జియా, నాష్‌విల్లే తదితర సిటీల్లో తెలుగు వారి ప్రాబల్యం వేగంగా పెరుగుతోందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఎంతలా ఉందంటే యూఎస్‌లో అత్యధికంగా మాట్లాడే విదేశీ భాషలు 350 ఉండగా అందులో తెలుగు 11వ స్థానంలో నిలిచిందట.

ఐటీ, ఫైనాన్స్ రంగాలపై ఆసక్తి..

అమెరికా వెళుతున్న వారిలో దాదాపు 75 శాతం పైగా ఇక్కడ ఇక్కడే స్థిరపడుతున్నారు. ప్రధానంగా డల్లాస్, బే ఏరియా, నార్త్ కరోలినా, న్యూజెర్సీ, అట్లాంటా, ఫ్లోరిడా, నాష్‌విల్లే తదితర ప్రాంతాల్లో తెలుగు వారి ప్రభావం కనిపిస్తోంది. గతంలో స్థిరపడిన తెలుగు ప్రజలు పెట్టుబడులతో ముందుకొస్తున్నారు. మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. అయితే 80 శాతం కంటే ఎక్కువ మంది యువకులు ఐటీ, ఫైనాన్స్ రంగాలపైనే ఆసక్తి చూపిస్తున్నారని స్థానిక సర్వేల్లో వెల్లడైంది.

హిందీ, గుజరాతీ, తరువాతి స్థానంలో తెలుగు..

అమెరికాలో మాట్లాడే భారతీయ భాషల్లో అత్యధికంగా హిందీ మొదటి స్థానంలో ఉండగా, రెండో స్థానంలో గుజరాతీ, మూడో స్థానంలో తెలుగు ప్రజలు ఉన్నారు. అమెరికాలో సుమారు 350 విదేశీ భాషలు వాడుకలో ఉండగా అందులో తెలుగు భాష 11 స్థానంలో నిలిచింది. దీన్నిబట్టి అమెరికాలో తెలుగు ప్రజల సంఖ్యా ప్రభావం ఎంత వేగంగా పెరుగుతోందో స్పష్టం చేస్తోంది. ఏటా 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు అమెరికా వస్తున్నారని ఉత్తర అమెరికా తెలుగు భాషా సంఘం మాజీ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. వీరితో పాటు దాదాపు 10 వేల మంది హెచ్1బి వీసా హోల్డర్లు ఉంటున్నారు. ఇందులో 80 శాతం మంది తెలుగు సంఘంలో సభ్యత్వం నమోదు చేసుకుంటున్నారని ఆయన తెలిపారు.

3.2 లక్షల నుంచి 12.3 లక్షల వరకు..

యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా ప్రకారం 2016 నాటికి అమెరికాలో తెలుగు మాట్లాడే వారి సంఖ్య 3.2 లక్షల మంది ఉండగా, 2024 నాటికి ఈ సంఖ్య 12.3 లక్షలకు చేరింది. గతంలో వెళ్లి స్థిరపడిన నాలుగు తరాలకు చెందిన తెలుగు వారు, ఇటీవల కొత్తగా వెళ్లిన వారు సైతం అంతా అమెరికాను తమ సొంత ప్రాంతంలో ఉన్నట్లు భావిస్తున్నారట. తెలుగు మాట్లాడే వారు అత్యధికంగా కాలిఫోర్నియాలో 2 లక్షల మంది ఉండగా, టెక్సాస్ 1.5 లక్షలు, న్యూజెర్సీ 1.1 లక్షలు, ఇల్లినాయిస్ 83 వేలు, వర్జీనియా 78 వేలు, జార్జియా 52 వేల మంది ఉన్నారని నివేదికలు చెబుతున్నాయి.

ఎత్తు.. చిత్తు!

ఆకాశ హర్మ్యాల నేల చూపులు

6 నెలలుగా నిలిచిపోయిన హెచ్‌ఎండీఏ అనుమతులు

- కొత్త ప్రభుత్వంలో ఒక్క ఫైల్ కదలడం లేదు..
- ఎక్కడికక్కడ ఆగిన బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు
- తీవ్రంగా నష్టపోతున్నామంటున్న బిల్డర్లు, రియల్టర్లు
- అన్ని రంగాలపైనా ప్రభావం

సాక్షి, సిటీబ్యూరో:

ఆకాశహర్మ్యాలతో అంతర్జాతీయ హంగులను అద్దుకున్న గ్రేటర్ హైదరాబాద్ కొంతకాలంగా నేలచూపులు చూస్తోంది. గతంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాల కోసం హెచ్‌ఎండీఏ పెద్ద ఎత్తున అనుమతులు ఇచ్చింది. దీంతో నగరానికి పడమటి వైపున ఆకాశన్నంటే హైరైజ్ భవనాలు వెలిశాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు ఒక్క బహుళ అంతస్తుల భవనానికి కూడా అనుమతినివ్వకపోవడంతో నిర్మాణ రంగంలో స్తబ్దత నెలకొంది. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. హెచ్‌ఎండీఏలో ఒక్క ఫైలు కూడా ముందుకు కదలడం లేదని, ఆరు నెలలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిందని నిర్మాణరంగానికి చెందిన నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇటు రియల్‌ఎస్టేట్, అటు భవన నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఆ రంగాలపైన ఇతర వ్యాపారాలు కూడా మందిగించాయి. గతంలో 53 అంతస్తుల భవనాలకు సైతం ప్రభుత్వం అనుమతినిచ్చింది. కానీ ఇప్పుడు 5 అంతస్తుల నుంచి 10 అంతస్తుల భవనాలకు కూడా సకాలంలో అనుమతులు లభించకపోవడంతో బిల్డర్లు పడిగాపులు కాస్తున్నారు. హెచ్‌ఎండీఏతో పాటు డీటీసీపీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కూడా నిర్మాణరంగం ఒక్కసారిగా కుదేలైనట్లు పేర్కొంటున్నారు.

గత 6 నెలలుగా స్తబ్దత..

తుర్కయంజాల్ ప్రాంతంలో ఓ భవన నిర్మాణం కోసం 6 నెలల క్రితం దరఖాస్తు చేసుకుంటే ఇప్పటి వరకు అధికారులు ఎటూ తేల్చడం లేదని, రెవెన్యూ, నీటిపారుదల శాఖల నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) సమర్పించినప్పటికీ ఎక్కడి ఫైల్ అక్కడే ఉందని ఒక దరఖాస్తుదారుడు పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏలోని శంకర్‌పల్లి, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్ జోన్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఒకవైపు గత ఆరు నెలలుగా వందల కొద్దీ ఫైళ్లు పరిష్కారమయ్యాయని, సుమారు రూ.300 కోట్లకు పైగా ఆదాయం లభించందని అధికారులు చెబుతుండగా నెలల తరబడి ప్రణాళికా విభాగం అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పనులు కావడం లేదని పలువురు దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా 15 రోజుల్లోపే ఎలాంటి ఫైల్ అయినా పరిష్కరించవలసి ఉండగా 3 నుంచి 6 నెలలైనా పరిష్కారం కావడం లేదని పేర్కొంటున్నారు. మరోవైపు బహుళ అంతస్తుల భవనాల కోసం గత ఏడాది అక్టోబర్‌లో నమోదైన ఫైళ్లు కూడా ఇప్పటి వరకు ఒక్క అంగుళం కూడా ముందుకు కదకలపోవడం గమనార్హం. హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా దానకిషోర్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఒక స్థాయి వరకు లే అవుట్‌లు, భవనాలకు అనుమతులు ఇచ్చారు. కానీ ఇంకా వందల కొద్దీ పెండింగ్‌లోనే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

నో సిట్టింగ్..



బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులను ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశమై సంబంధిత ఫైళ్లు నిబంధనల మేరకు ఉన్నదీ లేనిదీ పరిశీలిస్తుంది. హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌తో పాటు, జీహెచ్‌ఎంసీ, డీటీసీపీ సీసీపీలు, ఒక ఆర్కిటెక్టర్‌లతో కూడిన ఈ కమిటీ సమావేశమై భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తుంది. అన్ని విధాలుగా సంతృప్తి చెందిన తరువాత మాత్రమే అనుమతి లభిస్తుంది. కానీ ఈ ఆరు నెలల్లో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా కమిటీ సమావేశమై అనుమతులను ఇచ్చిన దాఖలాలు లేవు. నిర్మాణరంగ నిపుణుల అంచనాల మేరకు హెచ్‌ఎండీఏ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గత ఆరు నెలలుగా సుమారు 200 ఫైళ్లు బహుళ అంతస్తుల భవన అనుమతుల కోసం ఎదురు చూస్తున్నట్లు అంచనా. మరోవైపు పైనుంచి గ్రీన్‌సిగ్నల్ లభిస్తే తప్ప ఫైళ్లు కదలడం కష్టమేనని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.


భారీ నష్టం..



నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ పూర్తిగా స్తంభించాయి. ఇప్పటికే బుకింగ్ చేసుకొన్న కొనుగోలుదారులు ఎదురు చూస్తున్నారు. కొత్త బుకింగ్‌లకు అవకాశం లేకుండాపోయింది. కేవలం నిర్మాణ రంగానికే కాకుండా దానిపైన ఆధారపడిన అన్ని రకాల వ్యాపారాలు గత 6 నెలలుగా భారీ నష్టాన్ని చవి చూస్తున్నాయి. కూలీలు మొదలుకొని రవాణా రంగానికి చెందిన కార్మికులు, చిరు వ్యాపారుల నుంచి బడా వ్యాపార సంస్థల వరకు వివిధ రకాలుగా ఈ నష్టాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తే మంచిది.

– సత్యనారాయణ చిట్టి, డైరెక్టర్ ఆస్పిరియాలిటీ

ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది



హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పరిస్థితి ఇలాగే కొనసాగితే..ఈ రంగానికి చెందిన వ్యాపారులకే కాదు..ప్రభుత్వానికి కూడా కష్టమే. ఆర్థిక వ్యవస్థలు దారుణంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ నగరాల సరసన హైదరాబాద్‌ను చేర్చాలంటే నిర్మాణ రంగం కుంటుపడకుండా చూడాలి. ఇలా 6 నెలలుగా స్తబ్దత నెలకొనడం మంచిది కాదు.

– సురేష్ నామాల, రియల్‌రంగ నిపుణులు

పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి

- భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల స్థలాలు
- జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

షాబాద్: గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు మండల పరిధిలోని వెంకమ్మగూడ, ఊబ్బగుంట గ్రామాల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు అందిచామన్నారు. ఎన్నికల హామీలు దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరానికి, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు దగ్గరగా ఉన్న షాబాద్ మండలంతో పాటుగా చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. ప్రభుత్వ సహకారంతో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే పరిశ్రమల ఏర్పాటుకు భూములిచ్చిన చందనవెళ్లి, హైతాబాద్, సోలీపేట్, సీతారాంపూర్ గ్రామాల రైతులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. గత పదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి అత్యధిక నిధులు తీసుకువచ్చానని గుర్తు చేశారు. షాబాద్ మండలంలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలోని ఈసీ, మూసీ వాగులపై వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గుత్తి సునీత, మాజీ సర్పంచ్‌లు శంకుతల, నర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాండు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణగౌడ్, ఈదుల కృష్ణగౌడ్, రమేశ్ యాదవ్, కుమ్మరి దర్శన్, మల్లేశ్, గణేశ్ గౌడ్, నాయకులు రామస్వామి, చెన్నయ్య, వెంకటయ్య, నర్సింహులు, సుదర్శన్, అవిలాష్‌గౌడ్, నరేందర్, బొజ్జయ్య, గ్రామస్తులు తదితరులున్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న అనితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, కాలె యాదయ్య

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: నియోజకవర్గంలో నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలను.. టికెట్ ఇచ్చిన పార్టీల నమ్మకాలను వమ్ము చేస్తూ పార్టీలు మారుతున్న ఎమ్మెల్యేకు సిగ్గుండాలంటూ చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎస్ రత్నం తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్‌లో గెలిచిన ఆయన అభివృద్ధి ముసుగు కప్పుకొని టీఆర్‌ఎస్‌లో చేరాడని.. ఇప్పుడు కారు గుర్తుపై ఓటేసి గెలిపిస్తే బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారని మండి పడ్డారు. ఆయనకు కేవలం అధికారం, తన కుటుంబం, తన అక్రమాస్తులు కాపాడుకునేందుకే కండువాలు మార్చుతున్నాడని ఎద్దేవా చేశారు. కాలె యాదయ్య బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి తప్పిదాలతోనే చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, వెంకటరాంరెడ్డి, పార్టీ మండలప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

అయ్యో పాపం.. మూగజీవాలు

- పొలంలో విద్యుదాఘాతం.. కాడెద్దు మృతి
- రైతు అప్రమత్తతతో ఇంకో ఎద్దు సేఫ్
- మరోఘటనలో రెండు పాడి పశువులు



కాడితో ఎద్దు కళేబరం

కందుకూరు: పొలం పనుల్లో ఉన్న కాడెద్దుల్లో ఒకటి విద్యాదాఘాతానికి గురై మృత్యువాత పడగా.. రైతు అప్రమత్తతో మరో దానికి ప్రమాదం తప్పింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత రైతు, కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి బాచుపల్లికి గ్రామానికి చెందిన పగడాల యాదయ్య, తనకు చెందిన ఎడ్లతో అద్దె రూపేణా.. కప్పాటి బబూల్‌మోహన్‌రెడ్డి పొలంలో అరక కట్టి, మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్నారు. అరకతో రైతు యాదయ్య ముందు వెళ్తుండగా.. వెనకాల కూలీలు విత్తనాలు వేస్తూ ముందుకు సాగుతున్నారు.

సపోర్ట్ తీగకు విద్యుత్ సరఫరా

పొలంలో ఉన్న విద్యుత్ స్తంభంపై తీగలకు ఉండే ఇన్సులేటర్ పగిలిపోయి, కాసారం ద్వారా సపోర్టు వైరుకు కరెంటు సరఫరా అవుతోంది. ఇది గమనించని రైతు, కూలీలు పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ఓ ఎద్దుకు కరెంటు పోల్ సపోర్టు వైర్ తగలగా.. షాక్‌తో అది అక్కడికక్కడే మృత్యువాత పడింది. అప్రమత్తమైన రైతు మరో ఎద్దు తాడు విప్పి ప్రమాదం బారిన పడకుండా కాపాడాడు. వారు తప్పించుకున్నారు. గ్రామస్తుల సమాచారంతో ట్రాన్స్‌కో అధికారులు సరఫరాను నిలిపివేశారు. ఇదిలా ఉండగా.. విద్యుత్ అధికారుల తప్పిదం వలనే మూగజీవి మృత్యువాత పడిందని, తాము తప్పించుకోగలిగామని రైతులు, కూలీలు వాపోయారు. ఎద్దును కోల్పోయిన బాధిత రైతు యాదయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను తెలుసుకున్నారు.

వేలాడుతున్న వైర్లు తగిలి..



పాడిపశువుల కళేబరాలు

షాబాద్: వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి రెండు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధి ఉబ్బకుంట గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన మోత్కూరి శేఖర్ తన పాడిపశువులను మేత కోసం వదిలాడు. ఈ క్రమంలో అవి మేతమేస్తూ.. చిల్కమర్రి గ్రామ శివారులో సత్యనారాయణ మామిడి తోట వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగిలాయి. దీంతో షాక్ గురై చనిపోయాయి. వాటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు శేఖర్ కోరాడు. వేలాడుతున్న వైర్ల గురించి పలుమార్లు ట్రాన్స్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు.

ట్రేల మాటున నకిలీ పత్తి విత్తనాల తరలింపు

8 క్వింటాళ్ల విత్తనాల పట్టివేత

శామీర్‌పేట్: ఖాళీ ట్రేల చాటున నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తున్న ఓ వ్యక్తిని శామీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. సూర్యాపేట నుంచి మంచిర్యాలకు నకిలీ విత్తనాలను తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు మేడ్చల్ ఎస్‌వోటీ, శామీర్‌పేట పోలీసులు సంయుక్తంగా హైదరాబాద్ – కరీంనగర్ రాజీవ్ రహదారిలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో టీఎస్ 18 టీ 6999 నంబరు గల డీసీఎం వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఖాళీ ట్రేల మధ్యలో నిషేధిత పత్తి విత్తనాలు ఉన్నాయి. దీంతో డ్రైవర్ మల్లేష్ (32)ను అదుపులోకి తీసుకొని విచారించగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన గుండా రాజు ఆదేశాలతో ఈ విత్తనాలను తరలిస్తున్నట్లు తెలిపాడు. 8 క్వింటాళ్లపత్తి విత్తనాలు, సెల్‌ఫోన్, డీసీఎం వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడు రాజును త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీసీపీ తెలిపారు. ఈ సమావేశంలో పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, శామీర్‌పేట సీఐ శ్రీనాథ్, ఎస్సైలు హారిక, మునీందర్, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అభిప్రాయాలు నివేదిస్తాం

వ్యవసాయ సహకార సంఘం జిల్లా అధికారి ధాత్రిదేవి

చేవెళ్ల: రైతు భరోసా పథకం అమలుకు రైతులు తమ అభిప్రాయాలను చెప్పాలని వ్యవసాయ సహకార సంఘం జిల్లా అధికారి ధాత్రిదేవి, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం సొసైటీ ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. 200 మంది సభ్యులుండగా వందకు పైగా మంది పది ఎకరాలకు ఇవ్వాలని.. 50 మంది ఐదెకరాలకే పరిమితం చేయాలన్నారు. సాగు భూమిని గుర్తించి ప్రతి ఎకరాకు అందిచాలని మరికొందరు అభిప్రాయపడ్డారు. రైతుల సూచనలు, అభిప్రాయాలను త్వర్లోనే ప్రభుత్వానికి అందజేస్తామని ధాత్రిదేవి అన్నారు. కార్యక్రమంలో ఆడిటర్స్ నర్సింహారావు, ఉస్మాన్, వైస్ చైర్మన్ మల్లేశ్, డైరెక్టర్లు పి.రాములు, లక్ష్మయ్య, ప్రవీణ్‌రెడ్డి, మాధవరెడ్డి, నరేందర్, రాఘవ రెడ్డి, శివరాజ్, ఉపేందర్ సింగ్, అరుణమ్మ, బాలమ్మ, సీఈఓ భరత్‌కుమార్, మాజీ చైర్మన్ బల్వంత్‌రెడ్డి, రైతులు, వ్యవసాయాధికారి తులసి, ఏఈఓ వరుణ్ తదితరులున్నారు.



చేవెళ్ల: మాట్లాడుతున్న ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చిత్రంలో ధాత్రిదేవి

పక్కాగా రైతు 'భరోసా'

మొయినాబాద్: రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందని వ్యవసాయ సహకార సంఘం జిల్లా అధికారి ధాత్రిదేవి అన్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార కేంద్రం చైర్మన్ చంద్రారెడ్డి అధ్యక్షతన భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భరోసా పథకాన్ని ఎన్ని ఎకరాల వరకు ఇవ్వాలని.. రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో 10 ఎకరాల వరకు భరోసా ఇవ్వాలని కొందరు రైతులు అంటే, 5 ఎకరాల వరకే ఇవ్వాలని మరికొందరు, సాగుచేసే ప్రతి ఒక్కరికీ భరోసా అమలు చేయాలని ఇంకొందరు తెలిపినట్లు ఆమె వెల్లడించారు. మీమీ అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ధాత్రిదేవి తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఏఈఓలు కుమార్, సునీల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దర్గ మహేందర్, డైరెక్టర్లు జనగర్‌మోహన్‌రెడ్డి, ఉప్పరి శ్రీనివాస్, రాఘవరెడ్డి, యాదయ్య, గంగమ్మ, భూపాల్‌రెడ్డి, రాంరెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



రాజయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను మంగళవారం పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాజయ్య నివాసంలో ఆయన్ను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మంచాల: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంచాల మండలంలో బుధవారం పర్యటించనున్నారని ఎంపీడీఓ బాల శంకర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధి నోముల, మంచాల, ఆస్మత్‌పూర్, జాపాల, కాగజ్‌ఘట్, ఆగాపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎస్‌ఐకి సత్కారం

ఆమనగల్లు: ఆమనగల్లు ఎస్‌ఐ శ్రీనివాసులును మండల పరిధిలోని మేడిగడ్డతండాకు చెందిన నాయకులు సత్కరించారు. పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఇటీవల ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులును నాయకులు రవీందర్‌నాయక్, మేడిగడ్డ తాండా మాజీ సర్పంచ్ అమర్‌సింగ్‌లు మర్యదపూర్వకంగా కలిశారు.

శాయశక్తుల కృషి చేశా

ఇబ్రహీంపట్నం: కప్పపహాడ్ ఎంపీటీసీ పరిధిలోని గ్రామాలాభివృద్ధికి తన శాయశక్తులా ఐదేళ్ల కాలంలో కృషి చేసినట్లు మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి తెలిపా రు. ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తుండటంతో ఇబ్రహీంపట్నంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో తన పరిధిలోని కప్పపహాడ్, తుర్కగూడ, ఎర్రగుంట గ్రామాలల్లో రూ.12 .90 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు.

వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం

- కోడ్ ముగియడంతో ముసుగు తొలగించిన కాంగ్రెస్ నేతలు
- మహానేతకు ఘన నివాళి



చెరువుకట్టపై దివంగత వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగును మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు తొలగించారు. అనంతరం విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాధగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కట్టపై ఉన్న వైఎస్ విగ్రహానికి ముసుగు తొడిగారని, కోడ్ ముగియడంతో తొలగించామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్సార్ ఎంతో మంది పేద ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. అలాంటి గొప్ప నాయకుల విగ్రహాలకు సముచిత గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఏపీలో వైఎస్సార్ విగ్రహాలను కూల్చివేయడం, ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్యలుగా అభివర్ణించారు. రాజకీయంగా ఎదుర్కోవాలి తప్ప విగ్రహాల జోలికి వెళ్లొద్దని హితవు పలికారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలపై ఏనాడూ దాడులు జరగలేదనే విషయాన్ని అల్లరి మూకలు గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైఎస్సార్ అభిమానులు దుసారి బాలశివుడుగౌడ్, మంచాల మండల నాయకుడు నేనావత్ శ్రీనివాస్‌నాయక్, యువజన నాయకుడు యాదగిరి, వైఎస్సార్ యువసేన నాయకులు వేణుప్రసాద్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.3.05 లక్షల ఆదాయం

ఆమనగల్లు: మాంసాహార దుకాణాల నుంచి వెలువడే వ్యర్థాలను తొలగించేందుకు మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం 2024–25 సంవత్సరానికి వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో పట్టణానికి చెందిన ఆంజనేయులు రూ.3.05 లక్షలకు వ్యర్థాల తొలగింపు హక్కులను దక్కించుకున్నాడు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, మున్సిపల్ కమిషనర్ వసంత పాల్గొన్నారు.

కార్మికుల కష్టాలు తీర్చండి

- కనీస వేతనం అమలు చేసి.. పెండింగ్ జీతాలు చెల్లించాలి
- టీఎస్‌డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటయ్య, కార్మికుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు, కార్మికులు

కొందుర్గు: కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికులతో ప్రభుత్వం వెట్టి చాకిరి చేయిస్తుందని తెలంగాణ సర్వీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టగళ్ల వెంకటయ్య ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జీపీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇస్తున్న కొద్ది పాటి జీతాన్ని ఇద్దరికి పంచడం బాధాకరమన్నారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా కార్మికులను వేధిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకువేతనాలు అందజేయాలని కోరారు. సమావేశంలో కర్ణాటక సర్వీస్ వర్కర్స్ యూనియన్ సమన్వయ కర్త మల్లికార్జున, తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభుదాస్, నాయకులు వెంకటేశ్వరమ్మ, శ్రీనివాసులు, యాదమ్మ, లక్ష్మమ్మ, జంగయ్య పాల్గొన్నారు

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

పంచాయతీ కార్మికులకు నెలకు రూ.21 వేల వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహ రెడ్డి మాట్లాడారు. కారోబార్లకు రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్మికుల పని విషయంలో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఇందులో నాయకులు జంగయ్య, వెంకటేశ్, రమేష్, వీరేష్, ఈదమ్మ, గోపాల్, పాపయ్య ఉన్నారు.

తప్పిపోయిన చిన్నారుల చేరదీత

రాజేంద్రనగర్: ఆడుకుంటూ వచ్చి రైల్వే స్టేషన్‌కు చేరుకొని బుద్వేల్ రైల్వే స్టేషన్ వద్ద దిగి రోడ్డుపై ఏడుస్తున్న ఇద్దరు చిన్నారులను రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు చేరదీశారు. శంషాబాద్ హుడా కాలనీ ప్రాంతంలో కొందరు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన చిన్నారులు కార్తీక్ (6), చిన్న (4) ఆడుకుంటూ పక్కనే ఉన్న శంషాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలెక్కి బుద్వేల్ స్టేషన్‌లో దిగారు. రోడ్డుపైకి వచ్చి ఏడుస్తుండగా అక్కడే విధుల్లో ఉన్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ కానిస్టేబుళ్ల యాదయ్య, వెంకట్‌రెడ్డి, శివ వారి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు అప్పగించారు.



పోలీసులతో చిన్నారులు

ఇద్దరికి కత్తి పోట్లు

పాట్నర్స్ మధ్య పంచాయితీ



శరణ్‌రెడ్డి తలకు గాయం



పునిత్‌రెడ్డి కడుపులో..

ఇబ్రహీంపట్నం రూరల్: వ్యాపార భాగస్వాముల మధ్య పంచాయితీ కత్తిపోట్లకు దారి తీసింది. ఈ సంఘటన ఆదిబట్ల ఠాణా పరిధిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగ్లూర్ చౌరస్తాలో కృతుంగ హోటల్‌ను ఇద్దరు స్నేహితులు నిమ్మల దీపక్‌రెడ్డి, ఆవుల శరణ్‌రెడ్డిలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. కొద్ది రోజులుగా వ్యాపారం సరిగా లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో దీపక్‌రెడ్డి శరణ్‌రెడ్డికి రూ.3 లక్షలు ఇవ్వాల్సి ఉండగా.. అడిగితే నేడు, రేపు అంటూ దాటవేస్తున్నాడు. ఈ క్రమంలో ఇద్దరూ, మరికొందరితో కలిసి హోటల్ గదిలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. మాటామాటా పెరగడంతో సహనం కోల్పోయిన దీపక్.. పక్కనే ఉన్న కత్తి తీసుకుని శరణ్‌పై దాడి చేయగా.. అతని తలకు తీవ్ర గాయం అయింది. శరణ్ అల్లుడు పునీత్‌రెడ్డి దీపక్‌ను అడ్డుకోగా.. అదే కత్తితో పునీత్ పొత్తి కడుపులో పొడిచాడు. తీవ్రగాయాలతో పడున్న ఇద్దరినీ అక్కడే ఉన్న మరికొందరు పక్కనే ఉన్న అస్పత్రికి తరలించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దీపక్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు అయిందని ఎస్‌ఐ తెలిపారు.

కబ్జాలు అడ్డుకోవాలని వినతి

శంషాబాద్: పట్టణంలోని క్రీడా మైదానంలో కొందరు అడ్డగోలుగా కబ్జాలు చేస్తున్నారని బీజేవైఎం నేతలు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. క్రీడా మైదానంలో ఇప్పటికే కొందరు అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేయగా మరికొందరు కబ్జాలను చేపడుతున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన స్థలంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బదిలీల్లో తప్పిదాలను సవరించాలి

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్
- పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో డీఈఓకు వినతి



విద్యాధికారి సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీలు, స్పౌజ్ పోస్టింగ్‌లో జరిగిన తప్పిదాలను వెంటనే సవరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల 1వ తేదిన జరిగిన బదిలీల ఆర్డర్స్‌లో భాగంగా ఇచ్చిన పోస్టింగ్‌లో స్పౌజ్ ఉపాధ్యాయులు స్పౌజ్ దగ్గర ప్లేసెస్ కేటాయించలేదని తెలిపారు. ప్రమోషన్స్, సీనియారిటీ జాబితాలో గతంలో రెండు సార్లు పదోన్నతిని తిరస్కరించిన మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయల పేర్లు మళ్లీ ఇప్పుడు చేర్చారని, వారి పేర్లను వెంటనే తొలగించి, సీనియారిటీ ప్రకారం జాబితా పొందుపరచాలని కోరారు. ఎస్టీటీ ఉపాధ్యాయులను దశల వారీగా బదిలీ చేసి, వారికి ఎడిట్ ఆప్షన్ 24గంటలు ఇవ్వాలన్నారు. ఎగ్జైనెస్ట్ సబ్జెక్టుల్లో ఉన్న ఉపాధ్యాయుల ఆర్డర్స్ జాబితా ఇప్పటి వరకు పొందుపరచ లేదని పేర్కొన్నారు. జిల్లా కార్యాలయానికి వచ్చే ప్రతి ఉపాధ్యాయుడి పిటిషన్‌ను పరిశీలించాలని విద్యాధికారిని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు డాక్టర్ వర్కాల పరమేష్, ఎంఈఓలు కృష్ణ, కృష్టారెడ్డి, హెడ్‌మాస్టర్లు రాజిరెడ్డి, గిరిధర్‌లు పాల్గొన్నారు.